కథా నిలయం
5417
శ్రీకాకుళం

# మితంలోనే ఉంది స్థిమితం

మేథమెటిక్స్ లెక్చరర్ రామారావంటే, కాలేజీలో చదివే విద్యార్థి, విద్యార్థినులకందరికీ చనువు ఎంతో, అంతకంటే పదిరెట్లు భయమూ భక్తీను. ఆత్మీయత ఎంతో దానికి రెండింతలు మర్యాద గౌరవమూను.

చనువు ఎందుకంటే "నాకు పాఠం అర్థం కాలేదండి, ఈ లెఖ్ఖ ఎలా చెయ్యాలో తెలియలేదండి" అని ఎవరైనా ధైర్యంగా క్లాసులో లేచిఅడిగితే, పాఠం చెప్పే ప్లాట్‌ఫారమ్ మీంచి కిందకి దిగి, అడిగిన ఆ అబ్బాయి దగ్గరికో అమ్మాయి దగ్గరికో వెళ్ళి, విసుక్కోకుండా మళ్ళీ మళ్ళీ వివరించిచెప్పి "అర్థం అయింది" అన్నాక చిరునవ్వు నవ్వి, అప్పుడు బ్లాక్ బోర్డు దగ్గరికి వెళతాడు ఆయన.

భయభక్తులెందుకంటే, ఆయన క్లాసులోకి ప్రవేశించాక, ఇంకెవ్వరూ క్లాసు రూమ్‌లోకి రావడానికి వీల్లేదు. మధ్యలో మాట్లాడ్డానికీ, క్లాసు వదలి బైటకి వెళ్లడానికీ, వీల్లేదు. పాఠం జరుగుతూన్న గంటసేపూ క్లాసుక్లాసంతా, పాఠం వింటూ బోర్డుమీద ఆయన చేస్తూన్న లెఖ్ఖని అర్థంచేసుకుంటూనో. నోట్‌బుక్‌లో రాసుకుంటూనో ఉండవలసిందే! పక్క విద్యార్థితో మాట్లాడక పోవడంసరే, తల తిప్పడానికి కూడా వీల్లేదు. నిశ్శబ్దంగా, గుండుసూది కిందపడినా, వినిపించేటంత నిశ్శబ్దంగా ఉండాలి. ఇందులో ఏం తేడా వచ్చినా, ఆ స్టూడెంట్‌ని, వారం రోజులు తన క్లాసుకి రానియ్యడు రామారావు.

'యమ డిసిప్లెన్‌రాబాబూ!' అంటూ బయట ఎంత విసుక్కున్నా ఏ విద్యార్థీ రామారావు క్లాసుకి హాజరు కాకుండా ఉండడు. నిజానికి ఆయన క్లాసులో అటెండెన్స్ ఎప్పుడూ తీసుకోడు – అయినా అందరూ హాజరవుతారు. హాజరయి శ్రద్ధగా పాఠం వినడమే! గట్టిగా ఊపిరి పీల్చుకోడానికికూడా భయమే!

విద్యార్థులకే అన్నమాటేమిటి? ప్రిన్సిపాల్‌కి కూడా కాస్త భయమూ జంకూను గుండెల్లో. అందుకే "ఈ నోటీసు అన్ని క్లాసులకీ పట్టికెళ్ళు, ఒక్క రామారావు మేష్టారి క్లాసుకి తప్ప - ఏం? తెల్సిందా." అంటూ మరీ మరీ చెప్తారు ప్యూన్ అప్పన్నకి. ఎంత ముఖ్యమైన పనైనాసరే, ఆయన పీరియడ్ అయ్యాక, పంపాల్సిందే ఆ క్లాసుకి. పంపితే, క్లాసు డిస్టర్బ్ అయిందని విసుక్కుంటాడు రామారావు.

"ఆ! వట్టిబడాయి! పోనిద్దూ! తనొక్కడే లెక్చరరా? తనొక్కడే పాఠం చెప్తున్నాడా? సాగుతోంది - సాగించుకుంటున్నాడు" అని ఎంతమంది లెక్చరర్లు ఎన్ని మాట్లు చాటుగా మెటికలు విరిచినా, ఎదురుగా వచ్చినప్పుడుమాత్రం, అందరూ రామారావుని గౌరవంగా చూసేవారే!

కమిటీ మెంబర్లుమాత్రం?

లోపల్లోపల కాస్త కోపం ఉండవచ్చుగాక పైకిమాత్రం మర్యాదగానే మాట్లాడతారు. కోపం ఎందుకంటే, కమిటీ మెంబర్ల ఇంటికి వెళ్ళడంకానీ, ఇచ్చకాలాడ్డంకానీ, అశ్రయింపు నవ్వులు నవ్వడంకానీ, చేతులు కట్టుకుని చిత్తం చిత్తం అనడంకానీ ఏం చెయ్యడు రామారావు.

'అందరు లెక్చరర్లకీ లేనిది ఈ రామారావుకి ఏం వచ్చిందీ? ఇది అతని స్వభావమా, అహంకారమా, పొగరా?' ఇలా కమిటీ మెంబర్లు తమలో తాము వితర్కించుకుని, ఏ నిర్ణయానికీ రాలేక కాస్త కోపం పెంచుకున్నారు.

కాలేజీ వ్యవహారం ఇలా ఉంటే,

ఇంక ఊళ్ళో -

చాలామందికి రామారావు పట్ల గౌరవమే. ఓ రకమైన కృతజ్ఞత కూడా ఉంది. ఏమంటే - పాతికముప్పయి మార్కులు దాటని తమ పిల్లలకి, ఆయన పాఠం వినడంవల్లా, వాళ్ళు ఆయన క్లాసులో ఉండడంవల్లా, డెబ్బయిలూ, ఎనభయిలూ వస్తున్నాయి. ఇద్దరు ముగ్గురికి నూటికి నూరు వచ్చాయంటే, అరటిపండు ఒలిచినట్లు పాఠం చెప్పి రామారావు వాళ్ళకి ఉన్న చిన్న చిన్న అనుమానాలు, పోగొట్టడంవల్లే.

కొందరు తల్లిదండ్రులకి మాత్రం రామారావంటే, చిరాకు - ఏవంటే, వాళ్ళలో కొందరు రామారావు ఇంటికి వెళ్ళి, "మా వాడికి కాస్త లెఖ్ఖలు ట్యూషన్ చెప్పండి" అని కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలారు.

"మీరు ట్యూషన్ ఫీజు ఎంత అడిగితే అంత ఇస్తాం" అన్నారు ఒకరిద్దరు.

"మావాడికి లెఖ్ఖల్లో మంచి మార్కులు రాకపోతే ఆనక ఎమ్‌సెట్‌లో సెలెక్ట్ కాడు. మా ఇంట్లో అందరం ఇంజనీర్లమే – వాడు కాకపోతే ఎలా?" అని అడిగాడు ఒకాయన.

అందరికీ రామారావు చెప్పిన సమాధానం ఒక్కటే.

"అయ్యా! నేను ఇంటి దగ్గర ట్యూషన్లు చెప్పను. నెల తిరిగేటప్పటికి కాలేజీవారు ఇన్ని వేలు నాకు జీతం ఇస్తూ ఉండగా, నేను దాంతో తృప్తిపడకుండా ఇంటిదగ్గర ట్యూషన్లు చెప్పి డబ్బు సంపాదించాలనే కక్కుర్తి ఎందుకు. మనిషికి ఎంత డబ్బు కావాలి?"

"డబ్బు కోసం కాకపోతే మా కోసం చెప్పు" అన్నారు కొందరు. రామారావు అందుకూ అంగీకరించలేదు.

"నాకున్న ఓపికో తెలివో శక్తో ఏదో కాలేజీలోనే ఖర్చుపెడతాను. వాటిలో కొంత దాచుకొని ఇంటిదగ్గర మరో కోచింగ్ సెంటర్ తెరవను" – అన్నాడు ఖచ్చితంగా.

"ట్యూషన్లు చెప్పడంలో ఏ తప్పు లేదయ్యా! అదేమైనా లంచాలు పుచ్చుకోడంలా, అవినీతి పనా?" అని నచ్చచెప్పబోయాడు, ఊర్లో పెద్ద లాయరు ఒకాయన. "ట్యూషన్లు చెప్పడం తప్పట. విన్నారా యిలా అన్నాడు మీ గురించి రామారావు" అంటూ –

"నా దృష్టిలో అవినీతేనండి" అన్నాడు చటుక్కున రామారావు.

"మరి ఇతర లెక్చరర్ల సంగతి?"

"వారి ఇష్టం వారిది – నాకు మాత్రం నచ్చదు."

"నీ నుదుటనే పొద్దు పొడిచిందన్నమాట – బాగానే ఉంది చాదస్తం" అంటూ ఆ లాయరుగారు విసుక్కుని వెళ్ళిపోయారేగాని, వెళ్ళివూరుకోలేదు. పనిమాలా ట్యూషన్లు చెప్పే ఇతర లెక్చరర్లకి అందించాడు కబురు.

దాంతో కాలేజీలో చాలా మంది లెక్చెరర్లకి రామారావు మీద కోపం, ద్వేషం పుట్టుకొచ్చాయి. అతణ్ణి కొరకొరా చూడసాగారు. మాట్లాడ్డం మానేశారు. కాలేజీలో రామారావు ఓ రకంగా ఏకాకి అయిపోయాడు. స్టూడెంట్స్‌లో కొద్దిమందికీ, లెక్చరర్లలో చాలా మందికీ అతను విరోధి అయ్యాడు.

రామారావు గర్విష్టి
పొగరుబోతు –
– అహంకారి – మూర్ఖుడు.

అనే ముద్ర పడిపోయింది -

ఎవరు ఎంత ఈసడించుకొన్నా, అవమానించినా చలించకుండా స్థాణువులా ఉన్న రామారావు, ఇంట్లో పరిస్థితులుకూడా కొంత తారుమారు కావడంతో, మొదట్లో కంగారుపడి తెల్లబోయాడు.

"మీతో చేరినవాళ్ళే, ఆ నలుగురైదుగురు లెక్చరర్లూను - ఇప్పుడు చూడండి - స్కూటర్లు కొన్నారు. స్థలాలు కొన్నారు. ఇళ్ళుకట్టుకున్నారు. వేసీవెయ్యమంటూ ఉన్నారు. మీరూ ఉన్నారు. ఆ డొక్కు సైకిలూ - ఈ అద్దె ఇల్లూను" అంటూ కట్టుకున్న ఇల్లాలు - తనతో పదిహేనేళ్ళనుంచి కాపురం చేస్తూన్న ధర్మపత్ని - ఓసాయంత్రం ఈసడించుకొన్నప్పుడు, దిగ్భ్రాంతి చెందాడు రామారావు. జీతం సరిపోతుందే! దరిద్రం లేదే. అయినా ఇంకా డబ్బు యావ ఎందుకూ? -

"నాకు పట్టుపరికిణీలా? మానాన్న ట్యూషన్లు చెప్పరుగా? నాకీ చీటీగుడ్డ పరికిణీలే గతి" అని తన పన్నెండేళ్ళ కూతురు రమణి, పక్కింటి స్నేహితురాలితో విచారంగా అంటూండగా విని తలకొట్టేసినట్లయింది రామారావుకి.

"నాక్కూడా వాళ్ళ సురేష్‌లాగా చక్రాల సైకిల్ తొక్కాలని ఉంది నాన్నా - ఒకటి కొనిపెట్టవూ?" అని ఏడేళ్ళ కొడుకు రాజు, దీనంగా మొహంపెట్టి అడిగినప్పుడు, నిలువునా మంటల్లో నిలబెట్టినట్లనిపించింది రామారావుకి.

**బయట ఎగతాళులూ! ఎద్దేవాలూ -**
**ఇంట్లో దీనారావాలూ - నిట్టూర్పులూ -**
**వద్దు అంటున్న మనస్సు**
**ఒప్పుకో అంటూన్న పరిస్థితులు!**

కనీసం ఒక నెల్లాళ్ళయినా క్షీర సాగరమథనం సాగింది, రామారావు ఆలోచనల్లో - ఉన్నదాంతో తృప్తిగా బతకడమా? ధన వ్యామోహంతో నానాహైరానా పడ్డమా? ఇహ నేడో రేపో ఒక నిర్ణయానికి వచ్చి ప్రకటించేద్దాం అనుకొన్నాడు - "నేను వచ్చే నెల నుంచి ఇంటి దగ్గర ట్యూషన్లు చెప్పబోతున్నానోహోయ్!" అంటూ.

ఆ రాత్రి బొంబాయి నుంచి ఫోను వచ్చింది.

కాలేజీలో చదివేరోజులలో తన క్లాస్‌మేట్ రూమ్‌మేట్, అన్నింటికంటే తనకి అత్యంత ఆప్తుడు సునీల్ దగ్గర్నుంచి, "నువ్వు అర్జంటుగా నుంచున్న ఫళాణ బొంబాయి రావలసిందంటూ." కారణం ఏమిటంటే చెప్పలేదు.

ఏం కొంప మునిగిపోయిందో అని వెంటనే వెళ్లాడు రామారావు బొంబాయి.

స్టాక్ మార్కెట్‌లో బ్రోకరు సునీల్ - క్షణంలో లక్షలు పోతూఉంటాయి. లక్షలు వస్తూఉంటాయి - గుర్రప్పందేలు లాంటిది అతని జీవితం - క్షణం తీరిక ఉండదు - ప్రతి సెకనూ టెన్షనే - అతనేం వస్తాడు స్టేషన్‌కి అనుకున్నాడు రామారావు.

కాని కారు తీసుకుని వచ్చాడు దాదర్ స్టేషన్‌కి - "కారెక్కు" అని రామారావుని ఇంటికి తీసికెళ్ళాడు - దార్లో మౌనంగా ముక్తసరిగా ఉన్నాడు.

"ఎందుకు రమ్మన్నావు. ఏమైంది?" అంటే చెప్పలేదు - చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

లంకంత కొంప - తాజ్‌మహల్లాంటి పాలరాతి మందిరం - పోర్టికోలో కారు దిగుతూండగా సునీల్ భార్య సౌదామిని వచ్చి, "హమ్మయ్య! అన్నయ్యగారూ వచ్చారా!" అంటూ సాదరంగా రామారావుని లోపలికి తీసికెళ్ళింది.

"ఏం జరిగింది? ఎందుకింత అర్జంటుగా రమ్మన్నాడు?" అని గుంజాటన పడుతూనే ఉన్నాడు రామారావు.

టిఫిన్ల దగ్గరకాని సంగతేమిటో తేలలేదు.

"ఇంత అర్జంటుగా రమ్మని ఎందుకు అన్నానని నువ్వు ఆలోచిస్తున్నావు కదూ - చెప్తాను" అన్నాడు సునీల్.

"మీరు కాదు - నేను చెప్తాను" అంది సౌదామిని.

"మా పెళ్లయిన కొత్తలోనే, అంటే పదిహేనేళ్ళ క్రితం, మేం బొంబాయి వచ్చేయడం, ఈయ నీ స్టాక్ మార్కెట్ వ్యవహారాల్లోపడ్డం, షేర్లూ, డిబెంచర్లూ కొనడం అమ్మడం, ఇది అంతా మీకు తెలిసిందే కదా-"

"తెలియకేం? ఫోన్‌కి కూడా దొరకడు".

"ఫోను అంటారేవిటి - నాకూ పిల్లలకే దొరికేవారు కాదు - తెల్లారకుండా పోవడం, అర్ధరాత్రి దాటాకకాని ఇంటికి చేరుకోకపోవడం. తిండీ - నిద్రా - ఆరోగ్యం - భార్యా - పిల్లలూ - ఇల్లూ - సంసారం - సంతోషం - ఇవేమైనా పడితేనా. ఎంతసేపటికీ డబ్బూ - డబ్బు సంపాదనా. వెనకటికి ఇరవై నాలుగు గంటలూ, అరవై నాలుగు గంటలూ సైకిలు తొక్కడం పందేలుండేవి చూడండి. తొక్కేవాడికి నీరసం, నిస్త్రాణా వచ్చి ప్రాణాలు పోతున్నా 'తొక్కు - తొక్కు' అంటూ చుట్టూ ఉన్నవాళ్లు అరవడం, తొక్కే వాడికి అవస్థ - అల్లంత దూరంలో అవసాన దశ -

అపజయం భయం - ప్రాణాంతకమైన పరిస్థితీ అవునా? అలా సాగింది ఈ పదిహేను ఇరవై యేళ్ళూ మా సంసారం. నాలుగు రోజుల క్రితం నేను, పెద్ద పేచీ పెట్టేశాను. రామారావుగారు చూడండి ఎంత స్థిమితం అయిన జీవితం నడుపుతున్నారోను - ఏదో ఆ అయిదారు గంటలూ కాలేజీకి వెళ్ళడం రావడం - మిగిలిన సమయం అంతా సంతోషంగా భార్యా బిడ్డలతో గడపడం - జీవితం అంటే అదండీ. ఎంత సంపాదించాం అని కాదు - ఎంత ప్రశాంతంగా జీవించాం అని. ఏం? మీలా ఆయనకూడా వేలూ లక్షలూ సంపాదించలేరా? మేథమేటిక్స్ లెక్చరర్ - కో అంటే కోటిమంది ట్యూషన్‌లకి చేరతారు - తెల్లారకట్ల అయిదు నుంచి పది దాకా అయిదు బేచ్‌లు - సాయంత్రం అయిదు నుంచి పది దాకా మరో అయిదు బేచ్‌లు - మొత్తం పది బేచ్‌లకీ కలిపి, వంద మంది ట్యూషన్‌పిల్లలు - ఒక్కొక్కళ్ళు నెలకి వంద రూపాయలిచ్చినా పదివేల రూపాయలు - అదీ జీతం కాక - ఏం? చేదా? చేదనే మానేశారు - మనీ కాదు మానసిక విశ్రాంతి - అదీ జీవితం అంటే - అని రామారావు గారికి అర్థంఅయింది. మీ కెందుకు అర్థంకాదు? ఎంత సంపాదించాం అని కాదు - ఎంత శాంతిగా బ్రతికాం - ఎంత ప్రశాంతంగా జీవించాం - ఎంత హాయిగా అనుభవించాం - జీవితానికి అర్థం ఇదండీ - రామారావుగారిని చూసి నేర్చుకోండి - మీరు రేపటినుంచి, డబ్బుతో కూడిన ఈ పరుగుడు పందెం మానకపోతే, నేను నా పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోతా" అని బెదిరించాను.

"మరి మారాడా?" అని అడిగాడు రామారావు.

"మారేనో, బ్రతికానో అనుకోరా బాబూ! తర్వాత రెండు రోజులకే యు.యస్. 64 స్కామ్ బయటపడింది - నేను అప్పటికి చేతులు కడిగేసుకున్నాను కనక సరిపోయింది - నాకు వాటిలో లక్షలాది యూనిట్లతో లావాదేవీలున్నాయి. సౌదామిని పేచీపెట్టి నన్ను ఈ స్టాకు మార్కెటునుంచి బయట పడేసింది. లేకపోతే, ఈ మేడా, ఈ బేంక్ బేలెన్స్ అన్నీ పోయి ఈపాటికి బొంబాయి వీధుల్లో బిచ్చం ఎత్తుకుంటూ ఉందును" అన్నాడు సునీల్.

"అయితే ఈ పుణ్యం సౌదామిని దన్నమాట"

"కాదండీ! ఇది మీది - మీరు ట్యూషన్లు, డబ్బు సంపాదించడం - గోలా అవేవీ లేకుండా హాయిగా ఉండడంవల్లే, మిమ్మల్ని చూపించి ఈయన్ని ఒప్పించాను" రామారావుకి తలతిరిగింది. 'నిజమే - డబ్బు సంపాదన పిచ్చి వ్యామోహం. వచ్చిందాంతో తృప్తిపడతాను - ట్యూషన్లు చెప్పను' అని గట్టిగా నిర్ణయించుకొన్నాడు. ఒకనాడు గట్టిగా నిలబడ్డ రామారావే - ఈ మధ్య కాస్త ఇటూ అటూగా ఊగి

ప్రవాహానికి వాలుగా వెళ్దామనుకున్నవాడే! ప్రవాహానికి ఎదురుగా తిరిగి నిల దొక్కుకున్నాడు 'డబ్బు యావలోపడి ట్యూషన్ల ఊబిలో కూరుకుపోకూడదు - ఉన్నదాంతో తృప్తిపడి భార్యా పిల్లలతో హాయిగా జీవితాన్ని అనుభవించాలి - ట్యూషన్లు చెప్పేవాళ్ళు భార్యతో కబుర్లు చెప్తున్నారా? పిల్లలతో ఆడుకుంటున్నారా? పాపం ఏం బ్రతుకువాళ్ళది? అలాంటి బ్రతుకు నాకు వద్దు' అంటూ నిశ్చయించుకున్నాడు జారబోయిన కాలు కూడదీసుకున్న రామారావు.

(తెలుగు విద్యార్థి, నవంబర్ 2001)

---

*